

# పరాభవ

నరసింహంగారు తన కచేరీగదిలో కూచుని వొక కాగితం ముందుపెట్టుకొని తీవ్రంగా ఆలోచిస్తున్నారు. అది వొక చిన్న లేఖ. దానిలో విషయం అతనిని బాగా కలవరపెడుతూన్నట్టు, మాటిమాటికీ ముడుతలుపడుతూన్న అతని కనుబొమలు తెలియజేస్తున్నాయి. పార్టీలంతా అప్పుడే వెళిపోయారు. ఇక ఆయన లేచి స్నానం భోజనం ముగించి కోర్టుకు వెళ్లాలి.

తొమ్మిదిన్నర అయింది. కమల కాలేజీకి వెడుతూంది. 'అమ్మాయీ! ఇలా వొకసారి వస్తావా' అని నెమ్మదిగా పిలిచారు ఆయన. చేతిలో పుస్తకాలతో సహా కమల వచ్చి ఆయన ముందున్న కాగితం చూసి గతుక్కుమంది.

'ఈ వుత్తరం చూసేవా?' నెమ్మదిగా ప్రశ్నించారు.

'చూసేనండీ నాన్నారూ.'

'అయితే దీని విషయమై నీ అభిప్రాయం యేమిటి?'

ఆమె యెక్కువగా ఆలోచించలేదు. గాభరా పడలేదు 'నేనేం చెప్పగలను! అతడలా వ్రాస్తాడనుకోలేదు' అంది.

'అయితే యీ విషయం తీవ్రంగా ఆలోచించవలసిందేనా?'

ఆమె జవాబు చెప్పలేదు. అలా నిలుచుండిపోయింది. అతడామెను వెళ్ళమన్నాడు. ఆమె కాలిక్రింద చీమ నలగని అడుగులతో వెళిపోయింది.

నరసింహంగారు కమల చదువుకునే గదిలోకి వెళ్ళి ఆమె నోటు పుస్తకం వొకటితీసి తెరిచి, దానిప్రక్కనీ లేఖపెట్టి చేవ్రాళ్లు పరిశీలించి, పెదవులు బిగించి తల పంకించారు. తిరిగి తన కచేరీ గదిలోకెళ్లి ఆ కాగితం తన డ్రాయరులో పెట్టి తాళం బిగించారు.

కమల యింటరు చదువుతున్నాది. తెలివి అందం కలిగిన పిల్ల. మితభాషి, అనుపాజ్ఞలలో పెరిగిన లక్షణాలు గలది.

వాళ్ళ యింటికి ఎదుటనే డాక్టరు సత్యనారాయణగారున్నారు. ప్లీడరుగారికీ డాక్టరుగారికీ ప్రాణస్నేహం. ఆ కుటుంబాలు పాతిక సంవత్సరాలుగా అన్యోన్యమైత్రి ప్రబలి యేక కుటుంబావలె మెలగుతున్నాయి.

డాక్టరుగారి కుమారుడు సుందరుడు మూడవ తరగతి చదువుతున్నాడు. అతడు చదువులో చాలా చురుకైనవాడు అందంగానే వుంటాడు. కాని కలుపుగోరుతనం లేని నజ్జుమనిషిలా కనిపిస్తాడు.

కమల, సుందరుడు బాల్యంనించీ తెలిసినవాళ్ళవడంచేత అరమరికలు లేకుండా తిరుగుతూండేవారు. కాని కమలకు యీడు వచ్చిన దగ్గరనుంచీ వాళ్ళ అన్యోన్య స్నేహానికి వొక పొలిమేర యేర్పరచుకుని ఆ హద్దులో మసలుతూండేవారు, కమల నమ్ర స్వభావం, సుందరుడి తలిదండ్రులకు ముచ్చటగొలిపింది. సుందరుడి నిష్కళంక ప్రవర్తనను, కమల తలిదండ్రులు చాలా మెచ్చుకునేవారు. కాని ఆచార వ్యవహారాలలో ఐక్యమైనవాళ్ళ ప్రవృత్తులు వీళ్ళిద్దరినీ దంపతులు చేస్తే యెలా వుంటుంది అన్న ఆలోచన కలగనివ్వనే లేదు.

ఈ పరిస్థితిలో సుందరుడు కమలకు వ్రాసిన ప్రణయలేఖ ప్లీడరు దంపతుల హృదయాలలో

అంగర వెంకట కృష్ణారావు

వొక తాత్కాలిక అగ్నిశిఖ లేవదీసింది. కాల మార్గంలో చాలా దూరం ప్రయాణించిన ఆ అనుభవనీయ దంపతులు తమాయించుకున్నారు. అది అక్కడితో అంతమయితే పరవాలేదను కున్నారు.

మరునాడుదయం తిరిగి మరొక కాగితం పట్టుకుని నరసింహంగారు వట్టింటిలోకి వెళ్లేరు.

ఆవేళ ఆదివారం, శెలవురోజు. కమల, తల్లి కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కాగితం పట్టుకుని వస్తూన్న తండ్రిని చూడగానే కమల తలవొంచుకుంది, ఆయన కూతురివేపు చూడనే లేదు. భార్యతో అన్నారు.

'చూశావా! ఇది మరొక లేఖ! వాడే వ్రాసేడు.'

ఆమెముఖం తెల్లబోయింది. 'బాగానేవుంది వరస' అంది.

'వరసేమిటి? ఇది మన యింటా వంటా లేదు. ఎంత అప్రతిష్ఠ! ఈ విషయం సత్యనారాయణగారితో మాట్లాడితేగాని యింకా ముదిరేట్టుంది.'

తలదించుకునే కమల నెమ్మదిగా అన్నది. 'నాన్నారూ! వాళ్ళతో యెందుకు. అతనితోనే చెప్పి చూడరాదూ' తల్లి అన్నది. 'అది బాగుంది. లోనిమాయ మూకుడుంది కాని లోకం మాయ లేదు. ఇది యెంత తక్కువమందికి తెలిస్తే అంత మంచిది.'

అతడు పెదవులు కొరుకుతూ నిలబడి పోయాడు. అదే సమయానికి సుందరుడు వచ్చి ప్లీడరుగారి ఆఫీసుగదిలో కూచుని పుబుసుపోక యేదో లా పుస్తకం తిరగవేస్తున్నాడు. ప్లీడరు గారు రాగానే అతడు లేచి నమస్కరించి కూచున్నాడు. కుశలప్రశ్న లౌతూండగా కమల కాఫీ తీసుకువచ్చి సుందరుడి ముందు పెట్టింది. అత డామెవేపు చూడకుండా కప్పు స్వీక రించాడు. ఆమె వెళ్ళిపోయింది.

ఆ విషయం అతనితో యెలా చెప్పడమా అని ప్లీడరుగారు కొంతసేపు తచ్చాడి, సమ్ము ఖానికివచ్చి రాయబారం యెందుకని ప్రారం భించారు.

'సుందరం, నిన్నొక విషయం అడుగుతాను.'

'అడగండి' అతడు చిరునవ్వుతో అన్నాడు. ఆయన జేబులోంచి కాగితం తీసి 'దీనిని నువ్వె ప్పుడైనా చూసేవా?' అన్నారు. అతడు పరి కించి 'ఏమిటది?' అని ప్రశ్నించేడు. బాగా చూడమని అతని దగ్గరగా వొకసారి వుంచి తిరిగి తీసుకున్నారు. అతడు చూడలేదన్నాడు.

'ఇది నువ్వు కమలానికి వ్రాసిన లేఖ. రెండవది. ఇలాంటిపని చెయ్యడం సబబుగా లేదు నేను పెద్దవాడిని. చెపుతున్నాను విను. మన కుటుంబాలు పాతికయేళ్ళ నుండీ వొక కుటుం బంలా వున్నాయి. నీమూలంగా యీ స్నేహాను బంధం తెగిపోతుంది. జాగ్రత్తగా ఆలోచించుకో.'

సుందరుడు అదిరిపోయేడు. అతడి తలమీద పిడుగుపడ్డట్టయింది. శరీరంలో నెత్తురయావత్తూ ముఖంలోకి ప్రవహించి ముఖం జేవురించింది. నిమిషం తరవాత పాలిపోయినట్టయింది. కష్టం మీద 'నేనా వుత్తరం వ్రాయలే'దన్నాడు.

'మరిచిపో. అదంతా గతం గతః. ఇకమీదట యిలాంటి వెఱ్ఱిపని చెయ్యబోకు. లేకుంటే మీ నాన్నగారితో చెప్పవలసి వస్తుంది' అని గద్దిం చేరు.

అతడు లేచి - కాళ్లు బరువుగా యీడుస్తూ వెళిపోతూ నడవలోకి రాగానే, తన గదిలోంచి వస్తూన్న కమల తారసపడింది. అతడి ముఖంలో తీవ్రత అగుపిస్తూంది. ఆమెముఖంలో బెంగ, సిగ్గు పెనగులాడుతున్నాయి. ఆమె యింటిలోపలికీ అతడు బైటకీ వెళిపోతూంటే ఒకరిదగ్గర కొకరు వస్తూన్నట్టు అనుభూతి పొందేరు.

మరుచటి ఆదివారం తిరిగి నరసింహంగారు రొజుకుంటూ వంటింటిలోకి వచ్చేరు. తల్లీ కూతుర్లు మామూలుగా పిచ్చాపాటీ సాగిస్తు న్నారు.

'చూశావా, వీడిపోగరు. తిరిగి లేఖవ్రాసేడు. వాళ్ళ తండ్రితో చెపితేగాని యీఆట కట్టేటట్టు లేదు.'

అతని భార్య బెగిలిపోయింది. పాలవంటి సంసారంలో వుప్పుగడ్డ పడుతూందని ఆమె సిగ్గు పడుతూంది.

'ఇంతకూ నాదే తప్పు. ఈడువచ్చిన పిల్లను మగాళ్ళ కాలేజీలో చదివించడం, విచ్చలవిడిగా తిరగనియ్యడం. సరిగ్గా వుండమంటే వుంటారా?

ఆ విధవతో నువ్విక మాట్లాడకు, వింటున్నావా కమలా! వాడి పుస్తకాలు నీదగ్గ రేమున్నాయో వాడిమొహాన పారేయ్. ఇక గుమ్మం తొక్కనివ్వను. నేను లేనప్పుడు వస్తే గెంటివేయండి.'

కమల నేత్రాలనుండి కన్నీళ్లు బొటబొట రాలేయి. సిగ్గుపడి లేచి వెళిపోబోయింది.

'ఈ ఉత్తరాలు నువ్వు చదువుతున్నావా?' కళ్లు పైటచెరగుతో తుడుచుకుంటూ ఔనని తల వూపింది.

'నీగదిలో కెలా వస్తున్నాయి?'

తల్లి సర్దింది 'ఎవరూ లేనప్పుడు తీసుకొచ్చి పడవేస్తున్నాడులా వుంది.

ఆ వూపున నరసింహంగారు డాక్టరుగారి దగ్గరకు వెళ్ళి ఉత్తరాలన్నీ చూపించేరు. మొదట ఆయనకు నమ్మకం కలిగి కొడుకుమీద అగ్గి అయిపోయేడు. ఇంట్లో లేడుగాని కొట్టినంత పని చేసును.

తరవాత యిద్దరు పెద్దమనుష్యులూ కలిసి సుందరం నోటుపుస్తకం వొకటి తీసి వ్రాతలు సరి పోల్చి చూసేరు. ఆ వ్రాత వేరు, యీ వ్రాత వేరు. దానిమీద తిరిగి ఘర్షణ జరిగింది. అది చిలికి చిలికి గాలివానైంది. వాళ్ల అభిప్రాయాలు తీవ్రంగా బెడిసిపోయేయి. మీ అబ్బాయిని కట్టుదిట్టం చెయ్యండి అంటే, మీ అమ్మాయిని అదుపాజ్ఞల్లో వుంచండి అని మాటలు మిగల చెప్పుకున్నారు. దాంతో పుష్కరద్వయ మైత్రి బూడిదలో కలిసింది.

గడపలుదాటిన కబుర్లు గాలితో బాటు వూరంతా వ్యాపించాయి. కాలేజీ గోడలమీద 'కమల × సుందరం = ఏమిటి?' అని వ్రాతలు బయలుదేరేయి. కమల కాలేజీకి స్వస్తి జెప్పింది.

ఇద్దరు వాళ్ళవాళ్ళ గుమ్మాలలో వొకే సమయాన నిల్చుండడం రెండుమూడుసార్లు జరిగింది. వీధిలో తారసిల్లడం తటస్థపడ్డది. వాళ్లు దగ్గరపడుతూన్నంతసేపూ దూరమాతూన్నట్టు అనుభూతి పొందుతున్నారు. కాని ఒకరిమీద వొకరికి కోపం వున్నట్టులేదు.

రెండుమూడు రోజుల కొకసారి ఉత్తరాలు యథాప్రకారం వస్తూనేవున్నాయి. నరసింహం గారు పళ్లు పటపట కొరుకుతూనే వున్నారు.

ఈలోపొక సుందరు డొకనాడు సినీమాకు వెళ్లేడు. ఈ సంగతి తెలియక కమలకూడా వెళ్ళింది. ఆట ఆరంభించిన తరవాత కమల లోన ప్రవేశించడం చేత కాకతాళీయంగా సుందరుడి ప్రక్కనే కూర్చుంది. ఆమె అతనిని పోల్చుకో లేదు. కాని అత డామెను పోల్చుకున్నాడు. వెంటనే లేచి వెళ్ళి నాలుగువరసల వెనుకనున్న కుర్చీలో కూర్చున్నాడు. అతడు వెళిపోతూంటే ఆమె పోల్చి రెండు నిమిషాల తరవాత ఆమె కూడా లేచి వెళ్లి అతని ప్రక్కను కూచుంది. అతడు తిరిగి లేవబోయాడు

'మీతో వొక విషయం మాట్లాడాలి, వెళిపోకండి.'

'ఈ స్థలంలోంచే కాదు. మీతో మాట్లాడితే యీ వూళ్ళోంచే వెళిపోవాలి' అతడు కటుకుగా అన్నాడు.

'క్షమించండి. మీరు తప్పు అభిప్రాయపడ్డారు. అంత పిరికివారు యెందుకు లేఖలు వ్రాయాలి? ఇంకా వ్రాస్తూన్నారుకూడాను!'

'ఇంత ఘోరంగా అబద్ధ మాడుతూన్న మీరు క్షంతవ్యులు కారు. నాకు చెల్లెళ్ళున్నారు. నే నంత పరువు తక్కువ కుటుంబంలో పుట్టలేదు.'

ఆమె అతనికోపం అర్థంకాక ఆశ్చర్యపోయింది.

'నేను మిమ్మల్ని ప్రేమించి లేఖలు వ్రాయడానికి మీరు విశ్వమోహినా లనుకొన్నారా? మీరు అలా అయితే కావచ్చుగాని నేను పై మెరుగులుచూసి మోసపోయే మూర్ఖుడినికాను.'



అతడి కుపితశోకాలు ఆమెలో చెప్పలేని ప్రశాంతానుభూతి కలిగించినా, ఆమె పెద్ద సంకే హంతో హృదయపోరాటం పడిపోయింది.

'క్షమించండి. అయినదేదో అయిపోయింది. మీరు పట్టి పిరికివారని మన యిద్దరి అంతరాత్మలకు తెలుసు. కాని యిక్కడినుండి లేచి వెడి పోకండి. విశ్రాంతి సమయంలో నేను యింటికి వెడిపోతాను.'

విశ్రాంతి సమయంలో ఆమె లేచి బైటికి వెళిపోయింది. ఆమె వెంట అతనుకూడా వెళ్లేడు. అతనిని లెక్కచెయ్యకుండా ఆమె చరచర వెళి పోతూంది.

'కమలా! ఒక్కరూ వెడతారా! సాయం లేకుండానే'

'గాలి వేస్తూందా? మీసాయం మీ జేబులోనే వుండనీయండి.'

నిజానికి వొంటరిగా వెళ్లడాని కామె మనసు గాని, వెళ్లనివ్వడాని కతని మనసుగాని వొప్పుకో లేదు. అయితే అతని సాయంతో వెళ్లినట్టు ఆమె మనసుగాని, ఆమెకు సాయం వెళ్లినట్టు అతని మనసుగాని సుతరాం వొప్పుకోలేదు. ఇద్దరూ తమ యిళ్లల్లో వాళ్లకే బొంకు బొంకేరు హఠాత్తుగా సగం ఆటలో తలనొప్పి వచ్చిందని.

* * *

రాత్రి పన్నెండు గంటలయింది. కమల గదిలో దీపం వెలుగుతూంది. గాలికోసం డాబా మీద నిద్రపోయిన నరసింహంగారు దిగివస్తూ నాలుగిళ్ళ వాకిలిలోంచి కిటికీ ద్వారా కమల కూచుని వ్రాస్తూండడం గమనించేరు. ఆమె కిటికీ వేపు వీపు పెట్టి వ్రాస్తూంది. పావుతావు సైజు కాగితం మీద. నరసింహంగారు వెనకనుంచి కని పెడుతున్నారు. ఆమె వ్రాత ముగించి, కాగితం మడిచి, బల్లమీద పెట్టి, దీపం ఆర్పి, గది తలుపు గొళ్లెం పెట్టి తన పడక గదిలోకి వెళ్ళి పడు కుంది. ఆమె వెళిపోయిన తరువాత నరసింహం గారు గదిలో ప్రవేశించి లైటువేసి - కాగితం చదివేరు. లేఖ! సుందరం వ్రాసినట్టుంది! ఆయన నోరు తడి ఆరిపోయింది. వ్రాత యిదివరకు లభించిన లేఖలలో దివలెనే వుంది. అది ప్రయత్నించి వ్రాసిన వ్రాతకాదు. కమల వ్రాత కాదు, సుందరుడిదికూడా కాదు! ఆ రాత్రి భార్యతో చెపితే ఆమె నమ్మలేదు.

మూడు రోజులు నరసింహంగారు రాత్రిళ్ళు పొంచివున్నారు. నాలుగోనాడు రాత్రి పన్నెండు గంటలకు కమల తన పడక గదిలోంచి వస్తూంది. ఆయన వెళ్ళి భార్యను లేపి కిటికీ వారకి తీసుకువచ్చేసరికి కమలలో ప్రవేశించి లైటువేసి కాగితం కలం కోసం వెతుకుతూంది. కాని మూడు రోజులనుంచీ ఈ ప్రయోగం నిమిత్తం రాత్రి పది గంటల తరవాత ఆ గదిలో కాగితం కలం లేకుండా చేస్తున్నా రాయన. వెలుతురున్నా తడుముకుంటున్నట్టు కమల నాలుగు మూలలా వెతికి వ్రాత సామగ్రి దొరకక వాలు కుర్చీలో కూచుని, ముందున్న ముక్కాలి పీటమీద తలపెట్టి అలాగే పడుకుంది. పది నిమిషాలపాటు తలిదండ్రు లామె నలా కనిపెట్టి, తరవాత లోపలికి వెళ్లి ఆమెను మేల్కొలిపేరు. ఆమె లేచి వాళ్లిద్దర్నీ చూసి ఆశ్చర్యపడి, తనక్కడి కెలా వచ్చాననీ ప్రశ్నించింది.

* * *

మరునా డుదయం నరసింహంగారు సత్యనారాయణగారింటికి మూడు నెలల వెనక తొలిసారిగా వెళ్లేరు. ఆయన వెనకనే భార్య కూడా వెళ్ళింది. వంటింలోంచి ఆడవాళ్ల నవ్వులు, ఆఫీసు గదిలోంచి మగవాళ్ల నవ్వులు అప్పుడే పెళ్లింటి వాసన కలిగిస్తున్నాయి. కరువులో అధిక మాసం అన్నట్టు రెండు ఆషాఢ మాసాలు అడ్డు తగిలినా కమలకు వుత్తరాలు రావడం మానివేసేయి.

అయితే మూడు నెలల క్రితం గోడలమీద స్కూలు పిల్లలు తెచ్చిన సమస్య పరిష్కారం అవడానికి సంవత్సరం కంటె యెక్కువ పట్టలేదు!